ఋజువులూ, సాక్ష్యాలూ, కావల్సి వచ్చిన యిటువంటి పరిస్థితిలో, మీకు మొహం చూపెట్టుకోలేక, ఈ బలవన్మరణానికి పాలుపడ్డాను.

నేను ఏ విధంగానూ ఎవరి పట్లా, ఎన్నడూ ద్రోహం చెయ్య లేదు. వేణు ఎప్పుడూ నన్ను సోదరిగానే ప్రేమించాడు. వీటి కైనా ఋజువులేదు కాని మీ పాద సాక్షిగా చెబుతున్నాను. మీరైనా నమ్మండి.

నేనీ గదిలో వున్నట్టు చిన్న మ్మకి తెలియదు. చిన్నమ్మను జీవి తాంతం వరకూ ఆదరించండి, శశికి నా ఆశీస్సులు.

మీ అభాగ్య పుత్రిక,

'పద్మ'.

గిరిధర్ వుత్తరం చదివి, శశి చెయ్యి పట్టుకుని లేచి, వుత్తరాన్ని చంద్ర శేఖర్రావుగారి చేతికిచ్చి తను మేడ దిగి, పద్మ స్టడీలో సోఫాలో కూర్చుని ఆలోచిస్తూ వుండగా, అంతవరకూ. కునికిపాట్లు పడుతున్న శశి, సోఫాలో గిరిధర్ పక్కనే పడుకుని నిద్రపోయింది.

● ● ●

పద్మ పరిస్థితిలో మార్పులేక పోవడం చూసి వేణు, లిల్లీని పద్మ గది బయటకి పిలిచి,

"ఈ ఘోరానికి కారణం నీకు, తెల్సనుకుంటాను" అని అడిగాడు.

"తెలియదు. అదే అయో మయంగా వుంది."

"ప్రస్తుతం తెలుసుకోటానికి ప్రయత్నించకు. తర్వాత నీకే తెలు స్తుంది. మరో సంగతి. డాక్టర్ గిరిధర్ మానసిక పరిస్థితి అంతబాగా లేదు. ఆయన్ని కొంచెం కనిపెట్టి వుండు. నేనూ, రఘూ యిప్పుడే బయలుదేరి, కలరా ఎయిడ్ కోసం మాధవపురం వెడుతున్నాం."

"అదేమిటి, అందరూ రేపు బయ ల్దేరదామనుకున్నాముగా?"

"అందరూ ఎవ్వరూ లేరు. మొన్న డాక్టర్ గిరిధర్‌గారి వుపన్యాసం ఫలితంగానూ, తదితర కారణాల వల్లా, అందరూ వెనక్కి తగ్గేశారు."

"మరి నేను?"

"పద్మకి నింపాదిగా వున్న తర్వాత నువ్వు బయల్దేరి వచ్చెయ్యి"

"పద్మ పరిస్థితిలా వుండగా వెళ్ళి పోతున్నావా వేణూ?"

"పద్మ బ్రతక్కపోతే నేనిక్కడ చెయ్యగలిగిం దేమీలేదు. బ్రతు కుతే నేనిక్కడుండక పోవడమే మంచిది. ఇంక ప్రశ్నలు వెయ్యద్దు లిల్లీ."

(సశేషం)



# కన్నెచెర

కథ ఎక్కడన్నా ప్రారంభం గావచ్చు. కాని అది పల్లెకన్నా పేటలో, పేటకన్నా పట్టణంలో ప్రారంభం కావడం మంచి దని విజ్ఞుల అభిప్రాయం. పట్టణంలోనైతే కథ రిక్షా లెక్క వచ్చు. బస్సుల్లో పరుగెత్తవచ్చు. హోటళ్ళలో దూరవచ్చు. సినిమాలు చూడవచ్చు. పల్లెలో ఈ సదుపాయాలు మృగ్యం. కానీ నగరవాసుల్లో సైతం కొందరు రిక్షా లెక్కడం లేదనీ, బస్సుల్లో పరుగెత్తడం లేదనీ, హోటళ్ళలో దూరడంలేదనీ, సినిమాలు చూడడం లేదనీ పాపం, ఈ కథకు తెలియదు. అందుకనే యిది ఒకానొక మహానగరంలోనే ప్రారంభ మౌతోంది.

ఆ నగరాన్ని గురించి ప్రత్యే కంగా చెప్పకోవలసిందేమీ లేదు. సగటు లెక్కన అయిదు నిమిషాల కొక బస్సు ఆ నగరంలోకి రాక పోకలు కొనసాగిస్తుంది. సాయం కాలమైతే రోడ్లపైన క్రిక్కిరిసిన జనాలమధ్య మిడిగాళ్లు నలిగిపో కుండా నడవడం కష్టం. క్రొత్త సినిమా విడుదలైతే వారం పది రోజులపాటు టిక్కెట్లు దొరకవు. రాజకీయ సభలు జరిగినా, గుడిలో తిరణాలు జరిగినా హెూటళ్ళ ముఖ ద్వారంలో "భోజనం లేదు" అన్న బోర్డు వ్రేలాడుతుంది. ఇలాంటి వివరా లెన్నయినా చెప్పవచ్చుగానీ, వీటివల్ల ఈ కథకు లాభించేదేమీ లేదు. ఎందుకంటే దురదృష్టవశాస ఈ కథ విహరించే రంగభూమి చాలాచిన్నది. ఉదహరింప బడిన నగరంలో మునిసిపాలిటీవారు శ్రద్ధా

మధురాంతకం రాజారాం


సక్తులతో పెంచి పోషిస్తున్న ఉద్యాన వనం ఒకటి వుంది. సదరు వనంలో అంతగా జనం నడయాడని మారుమూల చోట పచ్చిక జొంపాల మధ్య, కన్న తల్లిలాంటి గానుగ చెట్టు నీడలో ఓ సిమెంటు బెంచీ వుంది. ఆ పార్కు బెంచీచుట్టూ ఈ చిన్న కథ గిరవాటు కొడుతుంది. (ఒకటి రెండు సార్లు దారితప్పినట్లుగా యిది నగరంలోకి గూడా షికార్లు చిత్తగిస్తే అందుకు మన్నించ వలెనని పాఠక మహాశయులు ప్రార్థితులు.)

నిండుగా పన్నెండేళ్ళ నుంచీ ఆ బెంచీ సుందరరామయ్య గారిది! అంతే ఆయన దాన్ని దాన విక్రయాలకు యోగ్యంగా కొనుక్కున్నారని గాదు. సాయంకాలం ఆరు నుంచీ ఏడున్నరదాకా అలవాటుగా అక్కడ కూర్చుంటూ రావడంతో, ఆ బెంచీపైన ఆయనకు నైతికంగా హక్కు ఏర్పడినట్టయింది. ఈ విషయం తెలిసిన వాళ్ళెవరూ ఆ బెంచీ దరిదాపులకైనా వచ్చేవారు కారు. ఒక్కొక్కప్పుడు తెలియని వాళ్ళెవరైనా ఆ బెంచీని ఆక్రమించడంకద్దు. కాని ఒకటి రెండురోజుల్లో వాళ్ళే సుందరరామయ్య గారి నైతిక హక్కును గుర్తించి సద్దులేకుండా తప్పుకునేవారు. కానైతే నాటికీ నేటికీ ఈ నియమాన్ని అతిక్రమించిన వ్యక్తి ఒక్కడే ఒక్కడు. అతడిపేరు వెంకట్రావు.

ఏదో పనిమీద ఒకసారి సుందరరామయ్య గారు గ్రామాంతరం వెళ్ళవలసి వచ్చింది. ఒకటి రెండు వారాలపాటు ఆయన స్వస్థలానికి తిరిగి రాలేకపోయారు. ఆ లోగా ఏం జరిగిందంటే — ఈ వెంకట్రావన్న నడితరం మనిషి ఒకనాటి సాయంకాలం కాసేపు కులాసాగా కాలక్షేపం చేసి వెళ్దామన్న ఉద్దేశంతో పార్కులోకి వచ్చాడు. కడలి నడుమ నిర్జనద్వీపంలా వున్న ఖాళీ బెంచీనిచూశాడు. చల్లటిగాలి, నీటి తుమ్మలోనాని అదోరకమైన సువాసన్ని నెరపుతున్న పచ్చిక జొంపాలు, వాటి కవతల కట్టుని కోటలాగా దట్టంగా నిలబడివున్న క్రోటన్ మొక్కలు, ఆ ఏకాంత ప్రదేశాన్ని అతడు ఒక పట్టాన వదలి పెట్టలేక పోయాడు. మరునాటి సాయంకాలం గూడా అతడి కాళ్ళు అతణ్ణి అప్రయత్నంగా అక్కడికి తీసుకొచ్చేశాయి. అలా నాలుగైదు రోజులు గడిచే సరికి ప్రయాణం చేసిన కొద్దిసేపట్లో కంపార్టుమెంటులోని సుఖాసనం తనదే ననుకునే రైలు ప్రయాణీకుడిలా వెంకట్రావు ఆ సిమెంటు బెంచీ యిక తనదే ననుకున్నాడు.

అంతలో సుందరరామయ్యగారు






గూడా గ్రామాంతరం నుంచీ తిరిగి వచ్చేశారు.

ఆ పార్కు బెంచీ దగ్గర ఈ అపరిచిత వ్యక్తు లిద్దరూ ఒకరి కొకరు తారసపడిన సంఘటన నాలుగేళ్ళ నాటిది. ఆ బెంచీతో సుందరరామయ్యగారికున్న అనుబంధాన్ని గురించి వెంకట్రావుకు బొత్తిగా తెలియదు. తనలాగే యింకొక వ్యక్తి అక్కడ కూర్చో దలచుకుంటే అందుకు అడ్డుతగిలే ఉద్దేశం వెంకట్రావుకు ఏ కోశానా లేదు. కానీ సుందరరామయ్యగారి సంగతలా కాదు. నోరు విడిచి చెప్పక పోయినా, ఆయన తన వైముఖ్యాన్ని రకరకాలుగా ప్రకటించి చూశాడు. తన కంత చేరువగా ఒక అజ్ఞాత వ్యక్తి పొలకువను సహించడం కొద్ది రోజుల వరకూ ఆయనకు కష్ట సాధ్యంగానే వుండి పోయింది. ఆయన ఎదుటి వ్యక్తి వైపు విరోధిని చూచినట్టే చూచాడు. అతణ్ణి సంస్కారహీనుడైన మోటు మనిషిక్రిందనే తెక్కగట్టాడు. కానీ తనపట్ల సుందరరామయ్యగారిలో చెలరేగుతున్న వ్యతిరేక భావాలను గురించి పట్టించుకున్నాడుగాడు వెంకట్రావు. అతడు పొగచుట్ట కాల్చుకునేవాడు. గడ్డిపోచ నములుకునే వాడు. ఏడు కొట్టగానే లేచి తన దారిన తాను వెళ్ళిపోయేవాడు.

సఖ్యం సాప్తపదీనమంటారు. ఏడురోజులు గాదు, ఏడు నెలల

పాటు ఒకచోట కలిసి కూర్చున్నా ఆ యిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదంటే ఆ మాట వినడానికి విడ్డూరంగానే వుంటుంది. కానీ అది పట్టి నికరమైన నిజం మాత్రమే! అలా మరికొంత కాలం గూడా గడిచిపోయి వుండేదే! కానీ పరిణామాలను సృష్టించడం కాలానికి సహజగుణం! సుందర రామయ్యగా రొకరోజు ఒంటరిగా పార్కు బెంచీపైన కూర్చున్నారు. ఆ పాటికే వెంకట్రావు అక్కడికి వచ్చి వుండవలసింది. రాలేదు. ఆలస్యంగా రావచ్చుననే భావించారు సుందరరామయ్యగారు. ఆ రోజె గాదు, ఆ మరునాడు గూడా వెంకట్రావు జాడ కనిపించింది గాదు. అందువల్ల హఠాత్తుగా అతడేమై వుంటాడన్న జిజ్ఞాస ఒకటి గట్టిగా పట్టుకుంది సుందరరామయ్యగారిని. మనిషేమంత ఆరోగ్యవంతుడుగా కనిపించడు. కొంపదీసి జబ్బున పడ్డాడేమో! ఈ వూహ నిజంగాకపోతే ఆఫీసులో పని హెచ్చి వుండవచ్చు. అదీ గాకపోతే బంధు కార్యార్థమై పరస్థలం వెళ్ళాడేమో! ఐనా తనకెందుకీ ఆలోచన? అతడేమై పోయినా తనకు నష్టమయ్యేదేముంది? నష్టమయ్యేదేమీ లేకపోయినా, అతడేమైనా అయిపోవడం తన కిష్టం లేనట్టుంది. ఎందుకు? అందుకే కాబోలు మానవుణ్ణి సంఘజీవి అన్నారు పెద్దలు.

వరుసగా నాలుగు రోజులు గైర్ హాజరైన తర్వాత అయిదో నాటి సాయంకాలం పార్కులో ప్రత్యక్ష మయ్యాడు వెంకట్రావు. ఎన్నడూ లేనిది సుందరరామయ్యగారానాడు వెంకట్రావును పలకరించారు. ఆ పలకరింపులో కూడా ఎంతోకొంత ముభావం లేకపోలేదు. "ఈ మధ్య ఎందుకో ఈ వైపువచ్చినట్టులేదు." అన్నాడాయన. ఆ మాటతో తూము తలుపు తీసివేసినట్టయింది. తూముగుండా చెరువు నీరు దూసుకొచ్చినట్టు వెంకట్రావు తన సొద వెళ్ళబోసుకున్నాడు. "ఏం చెప్పమంటారండీ! ఈడొచ్చిన ఆడబిడ్డను యింట్లో వుంచుకోనడం నిప్పును ఒడిలో మూట గట్టుకోనడమేనంటారు! మూడేళ్ళ నుంచీ ఒకటే ప్రయత్నం.– వివాహ ప్రయత్నం! అనంతం పంతుల్ని ఎరుగుదురా, అతడే మా పెళ్ళిళ్ళ పేరయ్య! మూడేళ్ళలో ఏడు సంబంధాలు తీసుకొచ్చాడు. కొన్ని మాకు, కొన్ని వాళ్ళకు నచ్చక ఆ సంబంధాలు వీగిపోయాయి. మొన్న తెచ్చింది ఎనిమిదో సంబంధం.






దూరా భారమునైనా ఎంచక రెండు వందల మైళ్ళదూరం వెళ్లొచ్చాము. తీరా వెళ్ళి మాట్లాడిస్తే వాళ్ళరేటు యిరవైవేలని తెలిసింది. ఎక్కడి నా బ్రతుకు, ఎక్కడి యిరవైవేలు! నా జీవిత కాలంలో నేను సంపాదించినదంతా కలిపినా యిరవైవేలుండదు."

"అయ్యో పాపం! ఆడ పిల్లలకు పెళ్ళిళ్ళు కావడమంటే అవస్థేనట! నాకు తెలియదు. కానీ ఎవరినోట విన్నా అదేమాట!"

సుందరరామయ్యగారు వ్యక్తం చేసింది సానుభూతి అవునో కాదో వెంకట్రావుకు అంతుబట్టలేదు. అతడు ప్రశ్నించాడు.

"మీకు ఆడపిల్లలు లేరటండీ?"

"అబ్బె, లేరు, లేరు." పై కప్పు నుంచి పైన బడిన తేలునో, జెర్రినో విదిలించుకున్నట్టుగా అన్నారు సుందర రామయ్యగారు. "ఉండే ఆ బాధలు పడలేక ఉరి బోసుకుని చచ్చేవాడినేమో! ఎందుకంటే నాకి సాయం చేసి పెట్టమని ఒకర్ని ప్రాథేయపడడమంటే నాకు ప్రాణాలు పోయినంత పని! ఈ రోజుల్లో ఆడపిల్లల్ని కనడమే పెద్ద నేరంలా వుంది. ఆ నేరానికి విధింపబడుతున్న శిక్షలు గూడా చాలా దారుణంగా వున్నాయి. కాకపోతే వేలదగ్గర

నుంచీ లక్షలవరకూ అపరాధాలా? అవి సరిగ్గా చెల్లించుకోలేకపోతే అవమానాలా? ఏమిటండీ ఈ పీడన? ఎందుకండీ ఈ యాతన? ఐనా ఏమిటండీ ఈ సమాజపు తీరు? దొంగతనం, దగా, ఖూనీల లాంటి నేరాలు చేస్తే ఆ నేరస్తుల్ని ప్రభుత్వం కారాగారంలో పడవేసి వాళ్ళ శరీరాలను మాత్రం శిక్షిస్తుంది. ఆడపిల్లల్ని గన్న పెద్ద మనిషికి ఈ సమాజంలో ఎదురౌతున్న మానసిక క్షోభతో పోల్చిచూస్తే ఆ శిక్ష ఏపాటిది? అందుకే నా మట్టుకు నాకు ఈ ఘోరకలిని సమూలంగా చీల్చి చెండాడేయాలనిపిస్తుంది. గంగాదేవి తనబిడ్డల్ని నదిలో పారవేసిందంటే అందుకిదే అర్థం కావచ్చు. వాళ్ళు బహుశా ఆడబిడ్డలై వుంటారు..."

తలపైన ఒక రాతిదిమ్మ పడినట్టుగా వెంకట్రావు స్తబ్ధుడై పోయాడు. సుందరరామయ్యగారు చెప్పినట్టుగా ఆడపిల్లల్ని కనడం గొప్ప నేరమే! అలాగైతే ఆ నేరానికి విధింపబడుతున్న శిక్షల్లో ఇలా సహృదయతకు నోచుకోని కర్కశమైన సానుభూతిని భరించడంగూడా ఒకటేమో!

కొంచెం తేరుకున్నతర్వాత అడిగాడు వెంకట్రావు – "మీకు మగపిల్లలైనా వున్నారా బాబూ?"

"లేకేం!" – టక్కుమని వచ్చింది సమాధానం. "ముగ్గురు కొడుకులు. పెద్దవాడు యం. యే వ్రాయబోతున్నాడు..."

అంతటితో సుందరరామయ్యగారూరుకుంటే బాగుండుననుకున్నారు వెంకట్రావు. కానీ కుమారుణ్ణి యం. యే. దాకా చదివించబోతున్న తండ్రి, అతణ్ణి గురించి మరికొన్ని మాటలు చెప్పకుండా వూరుకోడం ఎలా కుదురుతుంది? ఆయన కొనసాగించారు.

"మా కృష్ణమూర్తికిది యిరవయ్యో సంవత్సరం. ఎలిమెంటరీ స్కూల్లో అయిదేళ్ళు. హైస్కూల్లోనూ, కాలేజిలోనూ ఆరురెండ్ల పన్నెండేళ్ళు వెరశి పదిహేడేండ్లు పోగా ఆ లెక్కన నాలుగో యేడు పెట్టగానే వాణ్ణి బడిలో చేర్చి వుండాలన్న మాట! ఏమంటారు? ఇది నిజంగా అబ్బురంగా లేదూ?"

అసలు మగపిల్లల్ని కనడమే అబ్బురం; పైకి చెప్పలేదు. మనసులోనే అనుకున్నాడు వెంకట్రావు.

"మా వేలు విడిచిన బావమరిది ఒకతను ఢిల్లీలో పనిచేస్తున్నాడు. పరీక్ష వ్రాయడమే తరువాయి, అబ్బాయి నక్కడికి పంపించేయమంటున్నాడు. అక్కడ వుద్యోగాలకేమి, కోకొల్లలు. కానీ నాకే వాణ్ణి అంతదూరం పంపడం యిష్టంలేదు.



ఢిల్లీ, బొంబాయి, బెంగుళూరు అంటూ దేశంపైన పడేగ్రహచారం వాడికేముంది? ఇంట్లో కూర్చున్నా వెదుక్కుంటూ రాదా ఉద్యోగం?"

ఉద్యోగంమాత్రమేనా, అమ్మాయి గూడా వెదుక్కుంటూ వస్తుంది. వాడికేం భాభూ అదృష్టవంతుడు. వాడి జీవితం వడ్డించిన విస్తరి. ఎటొచ్చి చెడిపోయింది నేనూ, నా కూతురే –అంటూ ఎలుగెత్తి అరవాలనిపించింది వెంకట్రావుకు!

కానీ అలా కాకుండా మరోవిధంగా చెప్పి ముగించాడు వెంకట్రావు.

"మా వైదేహికి మాత్రమేముందీ! కట్నాలకోసం వేలు లక్షలు గడించి పెట్టక పోవడం నా తప్పు. అంతేగాని మా అమ్మాయి గుణవంతురాలు. అందమంటారా, చిదిమి దీపం పెట్టుకోవచ్చు. ఎన్ని కష్టాలున్నా ఎసెసెల్సీ దాకా చదివించాను. మా అమ్మాయి గనుక నేనేం చెప్పినా అది డాబుగానే కనిపించవచ్చు. హెడ్ మిస్ట్రెస్ కాంతామతి నడిగతే ఆవిడే చెబుతుంది. మధ్యాహ్నల్లో ఆవిడ మా అమ్మాయిని ఇంటికి రానిచ్చేది కాదు. ఎండలో కందిపోతుందేమోనని తన కారియర్ భోజనంలో మా వైదేహికి కూడా వాటా యిచ్చుకునేది..."

ఇంత చెప్పిన తరువాత వెంకట్రావు తల పైకెత్తి చూచాడు. సరిగదా, సుందరరామయ్యగారు తన మాటల్ని వింటున్నట్టే లేదు! ఎంతయినా ఆడబిడ్డే గదా అన్న తృణీకారభావం ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తూనే వుంది.

వెంకట్రావుకు కోపం వచ్చింది. ఆ వచ్చిన కోపం మూడు పాయలుగా చీలింది. ఒకటేమో సుందరరామయ్యగారి పైకి! ఉన్నపాటున ఆయనకో అరడజన్‌మంది ఆడపిల్లలు పుడితేగాని ఆ కోపం శాంతించదు. రెండో పాయ తన పైకి! రాత్రికి రాత్రే లాటరీలో ఓ లక్ష రూపాయలు చేతికొస్తేగానీ ఈ కోపం చల్లారదు. మూడో పాయ సమాజంపైకి! ఈ ఏడుపుగొట్టు సమాజంలో మగవాడికో మదింపు. ఆడదానికో మదింపు. మళ్ళీ సోషలిజం కావాలనీ, రావాలనీ ఆందోళన!

ఆ రోజు రాత్రి యికమీదట పార్కుకు వెళ్ళగూడదన్న నిర్ణయానికి వచ్చాడు వెంకట్రావు. కానీ మరునాడంతా ఆలోచించి తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. పగలంతా ఆఫీసులో నిర్విరామంగా పనిచేయాలి. ఇంటికి వెళ్తే అశాంతి. మధ్యలో పార్కులో గడపుతున్న

కాలమే తన శరీరానికైనా, మనసుకైనా విశ్రాంతి. సుందరరామయ్యగారికి భయపడి తానీపాటి భాగ్యాన్ని గూడా ఎందుకు కోల్పోవాలి? ఎటొచ్చీ తాను తన దైన్యస్థితిని వెళ్ళబోసుకోకుంటే చాలు. ఈ లోకంలో ఎవడి గోడును ఎవడు వింటున్నాడు? ఆర్చేదెవరు? శరీరం తమది గాకపోతే కాశీదాకా ప్రాకమనే మనుషులు వీళ్ళు? ఎద్దు పుండు కాకికి నొప్పా? నెమలి కంట్లో నీళ్ళుకారితే వేటగాడికి నష్టమా?

పార్కులో కూర్చున్నంత సేపు వెంకట్రావు రాజకీయాలను గురించి మాట్లాడేవాడు. సాహిత్యాన్ని చెడ విమర్శించేవాడు. సంఘం పైన దుమ్మెత్తి పోసేవాడు. విద్యావిధానాన్ని ఈసడించి పారవేసేవాడు. కానీ ప్రసంగం వ్యక్తిగత విషయాల దగ్గరికి వచ్చేసరికి తనకు సంసారమంటూ ఒకటి లేనట్టు మూకీభావం వహించేవాడు. కానీ ఎల్లకాలమూ కాలం ఒక మాదిరిగా గడవదు. అందుకే యిది నా అభిప్రాయం, యిదే నా స్వభావం అంటూ తనకొక స్థిరమైన ఆకృతిని రూపించి చెప్పే మానవుడు అల్పజ్ఞుడేమోననిపిస్తుంది. ఎందుకంటే, ఓ రాతిని తీసుకెళ్ళి సముద్రపుటంచులో పడవేస్తే అలల అటు పోట్లవల్ల అది రోజుకొక రకంగా మారుతుంది. ఒకే చెట్టు ఋతుభేదాలవల్ల ఏడాదికి వెయ్యిరూపాలు ధరిస్తుంది. ఇక గాలికన్నా చంచలమూ, నీటికన్నా ప్రవాహ శీలమూ కలిగిన మానవ స్వభావం పైవాటికన్నా విభిన్నంగా ఎలా వుండగలుగుతుంది? మార్పు మానవ స్వభావం. ఈ కథలో వచ్చిన మార్పు ఎలా వచ్చింది, ఎవరిలో వచ్చింది అన్నదే ప్రస్తుతాంశం.

ఉన్నట్టుండి పార్కు బెంచీ చిన్నబోయింది. బెంచీ చిన్నబోవడమేమిటని ప్రశ్నించవచ్చు. జంటపక్షుల్లో ఒకటి కనిపించకపోతే గూడు చిన్నబోవడం లేదా? బెంచీ విషయంలోనూ అదే జరిగింది ఈసారి కనిపించకుండా పోయిన వ్యక్తి సుందరరామయ్యగారు. ఆ కనిపించకపోవడం గూడా ఒకటి రెండు రోజులుగాదు. నిండుగా నెలరోజులు!

సుందరరామయ్యగారు ఏమైనట్టు, ఎక్కడికి వెళ్ళినట్టు, ఏం చేస్తున్నట్టు — మున్నగు ప్రశ్నలు వెంకట్రావును తీవ్రంగా ఎదుర్కొన్నాయి. వాటి కతను రకరకాల సమాధానాలు గూడా చెప్పుకున్నాడు. కానీ వాస్తవం తెలిసి




వచ్చాక జీవితాన్ని పరిశీలించడానికి కేవలం ఊహలే చాలవనీ, కొంత అనుభవం గూడా కావాలని వెంకట్రావు గ్రహించాడు.

నెలరోజుల్లో సుందరరామయ్యగారు చాలా మారిపోయారు. హఠాత్తుగా వయస్సు నాలుగేళ్ళు మీరినట్టుగా ఆయన ముఖంలో వృద్ధాప్యపు ఛాయలు కానవస్తున్నాయి. ఉన్నచోట మినుకుమినుకుమింటూ, పరిసరాలకు కాంతినివ్వని గుడ్డి దీపాల్లా ఆయన కళ్ళు సులోచనాలక్రింద జోగుతున్నాయి. ఏదో అమూల్యమైన వస్తువును ధారబోసుకుని మతి గోల్పోయిన వాడిలా ఆయనలో వెర్రి వాలకం గూడా ద్యోతకమౌతోంది.—

"ఏమండీ! ఒంట్లో బాగాలేదా ఏమిటి?" వెంకట్రావు పరామర్శించాడు.

సుందరరామయ్యగారు అసలే నిప్పులం వున్నాడేమో? ఈ పరామర్శవల్ల అగ్గిపైన ఆజ్యం పడ్డట్టయింది.

"అయ్యా వెంకట్రావూ! ఢిల్లీ ఎక్కడుందో తెలుసా నీకు? నాకు తెలుసు - దేశపటాల్లో చూచి తనివి తీరక డబ్బు దండుగకు ఓర్చుకుని అంతదూరం వెళ్లొచ్చాను గనుక! నీ కిదవరకే చెప్పానేమో, అక్కడ నాకొక బంధుసత్తము డున్నాడని! అతగాడు త్రవ్వి తలకెత్తేస్తాడనే అనుకున్నాను. అడిగినప్పుడల్లా చూద్దాం గిద్దామని తాళజెప్పి, చివరకు యిరవైరోజుల తర్వాత నిలదీసి అడిగితే 'అదేమిటోయ్ బావా! ఇక్కడున్న వాళ్ళందరూ జేబుల్లో ఉద్యోగాలను వేసుకుని తిరుగుతున్నారా, అడ్డగానే ఒకటినీ దోసిట్లో పారవేయడానికి!' అంటూ తేల్చిపారేశాడు. — 'అదేం మాటయ్యా! మనవాడు చదువుకున్నదేమీ నాలీసు చదువుకాదు' అన్నాను. 'ఇది మరీ బాగుంది! ఇక్కడ అలాంటి చదువు చదువుకున్నవాళ్ళు యింటికొకరున్నారు' అన్నాడు— విన్నావా! ఇదీ కథ!"

"అదేమిటండీ సుందరామయ్యగారూ! మీ అంతటివారు మీరు ఒక సాయం చేసిపెట్టమని అడగడమే గొప్ప! అది తన చేతిలోని పనే అంటే ఆ మాత్రం చేసిపెట్టలేకపోయాడా ఆ పెద్దమనిషి!"

"ఆ మాటన్న తర్వాత అతని ముఖం చూడ్డానికే బుద్ధయింది కాదు. ఆ సాయంకాలమే బయల్దేరి తిరిగొచ్చేశాను."

"పోనీ యిక్కడెక్కడైనా ప్రయత్నించలేక పోయారా?"

"ప్రయత్నలోపమటయ్యా

వెంకట్రావ్! అబ్బే, అదేం లేదు. నీకు నోరువిడిచి చెప్పలేదంతే! అబ్బాయి కాలేజీనుంచీ వచ్చి రెండేళ్ళయిందా, ఈ రెండేళ్ళలో ప్రయత్నం చేయని రోజు లేదు. రోజుకొక అప్లికేషను. రాజుగారి వెంట అంగరక్షకుల్లాగా ప్రతి అప్లికేషనుకూ జతగా పది పన్నెండు సర్టిఫికెట్లు, నాటిమీద సంతకాల కోసం, గెజెటెడ్ ఆఫీసర్ల దగ్గరకు పరుగెత్తడాలు! వెరశీ, ఒక్క అప్లికేషను పంపుకోడమంటే ఒక చిన్న యాగం చేసినంత తతంగం! పోగా యించుమించుగా నెలకొక యింటర్వ్యూ. అది ప్రాక్పశ్చిమ సముద్రాల మధ్య, ఆసేతు హిమాచలాలమధ్య ఎక్కడైనా జరగవచ్చు. దూరమని వెనుకాడగూడదు. దొరకదని నికరంగా తెలిసేదాకా, ఉద్యోగం దొరకుతుందనే అనుకోవాలి. దూరంనుంచీ అవకాశం కొండలా కనిపిస్తుంది. దగ్గరికి వెళ్తే మంచులా విడిపోతుంది. ఇక శ్రేయోభిలాషులున్నారే, వాళ్ళదొక ఎడతెగని పోరు. 'ఏమండీ! అబ్బాయి ఏంచేస్తున్నాడు? ఇంకా ఖాళీగానే వున్నాడా? అయ్యో, ఎందుకండీ? మీ వాడికే ఉద్యోగం దొరక్కపోవడమా! అంటూ పేదార్పు మాటలు! ఫలానాచోట ప్రయత్నించలేకపోయారా. ఫలానా పెద్దమనిషిని కలుసుకోలేకపోయారా అంటూ సలహాలు! అంతెందుకూ! ఎడారిలో ఎండమావులుంటాయని చదువుకోలేదటయ్యా వెంకట్రావ్! ఈ రోజుల్లో ఆ ఎండమావికి పర్యాయ పదమే ఉద్యోగం!"

"నిస్పృహ పడిపోతే ఎలాగండీ సుందరరామయ్యగారూ! ఓర్చుకోవాలి మరి, ఓర్చుకోకుంటే ఓరుగల్లు పట్టణమవుతుందా?"

సుందర రామయ్యగారు ఏడుపు మొగం పెట్టేశారు—'సంగతి సందర్భాలు తెలిస్తే నువ్విలా కన్నుతుడుపు మాటలనేవాడివా వెంకట్రావ్! నాకీ పట్టణంలో ఉద్యోగసద్యోగాలేమీ లేవు. కేవలం బిడ్డల చదువు కోసమని యిక్కడికి వచ్చాను. పల్లెలో అయిదెకరాల మాగాణీ మాత్రం వుంద. దాన్ని బ్యాంకులో తనఖాపెట్టి ఆ డబ్బుతో పెద్దవాణ్ణి యిందాకా చదివించాను. రెండోవాణ్ణి మూడేళ్ళప్పుడే కాలేజీలో చేర్చి వుండవలసింది. ఒక్కసారిగా ఖర్చులూ భరించడం కష్టమని, పెద్దవాడికొక ఉద్యోగం ధొరికి నాలుగురాళ్లు చేతికొచ్చేదాకా రెండోవాడి చదువు వాయిదా వేశాను. వాడు మాత్రం గోళ్లు గిల్లుకుంటూ నాలుగు గోడల మధ్య ఎంత కాలమని కూచుంటాడు? అదృష్టం పరీక్షించుకోదలచినానని ఓ చీటీ వ్రాసిపెట్టి యింటినుంచి వెళ్ళిపోయాడు. వాడిపైన బెంగతో మా అవిడ చిక్కి సగమైపోయింది. పట్టణంలో ఈ కాపురం వెలగబెట్టింది చాలు గాని వూరికి వెళ్ళిపోదామని చెవిలో యిల్లు గట్టుకుని సతపోరుతోంది. పెద్దవాడికేదైనా ఉద్యోగం దొరికితే నిశ్చింతగా వూరి ముఖం పట్టవచ్చునని నా ఆశ!"

గంట ఎనిమిది దాటిందేమో రేడియో గొంతుకకుగూడా మూగతనం సిద్ధించింది. పార్కులో జనసంచారం బాగా తగ్గిపోయింది. వృద్ధులిద్దరూ రోడ్డుపైకి వచ్చారు. అరమైలు దూరం నడిచారు. సందుమొగలో నిలబడి వెంకట్రావు "నేనిలా వెళ్ళాలండీ సుందర్రామయ్యగారూ! సెలవిప్పిస్తే వెళ్లొస్తాను" అన్నాడు, "అరరే, నువ్వీ సందులో నేనా వుండడం! చూచావా వెంకట్రావ్! ఇన్నాళ్ళుగా పరిచయం వున్నా నీ యిల్లెక్కడో, నీ బ్రతుకెట్లాగో తెలుసుకోకుండా వుండిపోయాను. అంతే ఏమన్నమాట? మనం మనుషులంగానే పుట్టినా మనుషులంగా బ్రతకడం లేదన్న మాట! పద పద, ఈరోజు కాసేపు నీయింట్లో కూర్చునే వెళ్తాను..."

వెంకట్రావుకు ఆశ్చర్యంకలిగింది. అతడెన్నడూ సుందర్రామయ్యను తనతో సమానుణ్ణుగా ఊహించలేదు. ఆఫీసులో పై అధికారి తనకు ఎలాంటివాడో సంఘంలో సుందరరామయ్యగారు తనకలాంటి వాడని మాత్రమే భావించాడు. కలెక్టరుగారు ఒక గుమస్తా వెంట అతడి ఇంటికి బయల్దేరడం ఎంత విడ్డూరమో, సుందరరామయ్యగారు తన యింటికి రాగోరడమూ అంతే విడ్డూరం.

వెంకట్రావు కాపురముంటున్నది రెండంకణాల పెంకుటిల్లు. దాన్నిగత శతాబ్దం తాలూకు మధ్య తరగతి గృహ శిల్పానికి ఒక నమూనాగా పేర్కొనవచ్చు. ఇంటికి వేసినకలప, పైన పెంకులు, క్రింద గోడలు, యివన్నీ కాలక్రమాన తను పుట్టుకతోవచ్చినరంగును గోల్పోవడంతో అది ఒకానొక నల్లటి లోహంతో పోతపోసిన కట్టడంలా దృగ్గోచరమౌతోంది.

"సుందరరామయ్యగారూ! నేను పిలవకపోయినా మీరు మాయింటికి రావడం మా అదృష్టం. ఎలాగూ రానే వచ్చారు గనుక భోజనం చేసే వెళ్ళాలి" అన్నాడు వెంకట్రావు.

"అబ్బే, వద్దు బాబూ! భోజనానికి యింటికే వెళ్తాను. కాసిన్ని

మంచి నీళ్ళిప్పిస్తే చాలు' అన్నారు సుందరరామయ్యగారు.

"అమ్మాయ్, వైదేహీ! ఇంట్లో పాలుంటే కాస్త వెచ్చజేసి తీసుకొస్తావటమ్మా!"

"అలాగే నాన్నా!"

సుందరరామయ్యగారి కా కొత్త చోటు ఒక చిన్న నాటక రంగంలా పొడగట్టింది. తండ్రిపాత్ర రంగంపైన వుండగా, కుమార్తె పాత్ర యింకా యవనికాభ్యంతరంలో వున్నట్టు భాసించింది. ఈ నాటక రంగంపైన తన దిప్పుడు అతిధి పాత్ర. అబ్బో, ఈ విశాల పృధ్వీవలయంపైన ఎన్ని నాటకరంగాలు! ఎన్ని పాత్రలు! ఎన్ని కథలు!

తలుపు దగ్గర గాజుల చప్పుడు వినిపించింది.

"పరవాలేదు రావమ్మా వైదేహీ! వీరే సుందరరామయ్యగారు నా స్నేహితులు."

వైదేహి గ్లాసు చేతికిచ్చి సుందర రామయ్యగారికి నమస్కరించింది.

సుందర రామయ్యగారు ఎదుట నిల్చున్న ఆ అమ్మాయివైపు ఓ క్షణం చూచారు. రెండు క్షణాలు చూచారు. మూడు క్షణాలు చూచారు. కళ్ళు చెమ్మగిల్లడంతో తటాలున తల దించుకున్నారు. ఇంతటి అందమైన అమ్మాయా వెంకట్రావు కూతురు? ఈ అన్నుల మిన్నకా యింకా పెళ్ళి గాక పోవడం? ఈ ఒప్పుల కుప్పను ఏలుకోవడానికేనా వేల లెక్కలో కట్నాల బేరాలు?

గుండె గొంతుకలో కొట్టుమిట్టాడడమంటే ఏమిటో ఆ క్షణాన సుందర రామయ్యగారి కర్థమైంది. ఆయన వెంకట్రావుతో ఏదో చెప్ప దలచుకున్నారు. కానీ చెప్పలేక పోయారు. ఆ సందిగ్ధ స్థితిలోనే, బరువుగా కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరాడు.


ఇల్లాలు విస్తరివేసి అన్నం వడ్డించింది.

"ఇదిగో రత్నం! ఓ మాటడుగుతాను నిన్ను! అబ్బాయికి ఉద్యోగం దొరుకుతుందనుకో! మనం పెళ్ళి ప్రయత్నం తలపెట్టామనుకో! ఎలాంటి కోడలు కావాలనుకుంటావు నువ్వు?"

రత్నమ్మ నివ్వెరపోయింది. ఆ యింట్లో శుభ వర్తమానాలు, పరిహాస ప్రసంగాలు, సరాగాలు వినిపించి చాలా కాలమైంది మరి!

"నా కంతటి అదృష్టం గూడానా! ముప్ఫై యేళ్లుగా ఈ కాపురంలో సెలవులేని చాకిరీ చేస్తున్నాను. కోడలొచ్చే దెప్పుడు, నేను సుఖపడే దెప్పుడు?" నిట్టూర్చింది రత్నమ్మ.






తెచ్చికోలు ఉత్సాహం చప్పబడి పోగా సుందర రామయ్య తినీతిన కుండా విస్తరి ముందునుంచి లేచేశాడు—

● ● ●

కందెనలేని బండి చక్రం గతుకుల బాటవెంట దొర్లినట్టుగా కాల చక్రం పరిభ్రమిస్తోంది. పార్కు బెంచీపైన మిత్రుల సమావేశాలు మునుపటిలా అంత క్రమబద్ధంగా జరగడం లేదు. కాననంలో మాయామృగాన్ని వెన్నంటి పరుగెడుతున్నట్టుగా ఉద్యోగ ప్రయత్నాల్లో ఒకరు, వివాహ ప్రయత్నాల్లో ఒకరు, వూళ్ళపైన తిరగడం పరిపాటై పోయింది. కొద్దిరోజుల వియోగానంతరం మళ్ళీ పార్కులో కలుసుకున్నప్పుడు ఒకరికొకరు ఏ యే ప్రయత్నం ఏయేవిధంగా నిష్ఫలమై పోయిందీ చెప్పుకునేవారు, చిట్టచివర రివాజు ప్రకారం "మరేం దిగులు పడకండి సుందర రామయ్యగారు! ఇక చదవడానికేమీ మిగల నంతవరకూ కుమారుణ్ణి చదివించారు. ఏవో గ్రహాలు కలిసిరాక పోబట్టిగానీ మీ వాడికి దొరకని

ఉద్యోగమా!' అని ఒకరు,- 'బెంగ పెట్టుకోకయ్యా వెంకట్రావ్! నేను చూచానుగా! మీ అమ్మాయికేం బాబూ; ఆణిముత్యం! కాలం కలిసి రావాలంతేగానీ, పెళ్ళి దానంతటదే అయిపోదూ' అని పరస్పరం ఓదార్చుకునే వారు.

రోజులు గడచి పోతున్నాయి.

జరుగుతున్నది చలికాలం. ఓ రోజింకా భళ్ళున తెల్లవారలేదు. రాత్రంతా మంచు సోనలు కురిపించిన నిశాకాంత తెల్లవారు జామున లోకంపైకి ఈదురు గాలుల్ని ఉసి గొల్పుతోంది. ముసలి ప్రాణాలు రగ్గుక్రింద మాంసపు ముద్దల్లా ఒళ్ళు ముడుచుకునే ఆ చలికాలపు చల్లటి ఉదయాన వెంకట్రావు కాపురముంటున్న యింటి తలుపు దబదబా మ్రోగింది.

'ఎవరు, ఎవరు?' అన్నాడు వెంకట్రావు. 'నేను, నేను' అన్నారు సుందర రామయ్యగారు.

గబగబా లేచి వచ్చి తలుపు తీశాడు వెంకట్రావు. సుందర రామయ్యగారు మెల్లగా లోపలికి వచ్చి మంచంపైన కూర్చున్నారు. కూర్చున్న సుందర రామయ్యగారు ఇంటినంతా ఒకసారి కలయజూచి 'ఇంట్లో ఎవరూ లేనట్టున్నారే?' అన్నారు.


'ఎవరున్నారు? నేనూ, మా ఆవిడ యిద్దరమే మిగిలాము. ఏం చేయమంటారు సుందర రామయ్య గారూ! ఈడొచ్చిన అమ్మాయికి పెళ్ళి గాకపోవడముంది చూచారూ! అది ఒక బాధల సముదాయం. వేదనల పుట్ట. ఎలాగంటారా? సాటి బంధువుల్లో చులకన. ఇరుగు.. పొరుగువాళ్ళ నిరసన. ఈమె కింకా పెళ్ళి కాలేదా? ఎప్పుడో కావలిసిందే? ఎందుకు కాలేదు? అంటూ సవాలక్ష ప్రశ్నలు. ఇంట్లో కొచ్చి అమ్మాయి ముఖం చూచినప్పుడల్లా మన కివన్నీ జ్ఞప్తి కొస్తాయి. మనసులో దాచుకోవాలంటే దాగే దిగులా యిది! అది మా ముఖాల్లో వుండనూ వుంటుంది. అమ్మాయి ముఖంలో అద్దంలో ప్రతిబింబంలా కనిపించనూ కనిపిస్తుంది. కొంత కాలంపాటు తావైనా మారిస్తే, ఆమెకూ మాకూ కూడా కాస్త వూపిరి త్రిప్పుకునే వెసులుబాటు చిక్కుతుందేమోనని ఆశించాను. ఆశించినందుకు తగ్గట్టుగా అమ్మాయి నొకసారి తన దగ్గరికి పంపమని మా భాస్కరం జాబు వ్రాశాడు. భాస్కరమంటే మా వదినగారి కొడుకు. వాడి కక్కచెల్లెళ్ళు లేరు. మా అమ్మాయికా అన్నదమ్ముళ్ళు



లేరు. వైదేహి అంటే వాడికి ప్రాణం. ఆ అమ్మాయినక్కడికి పంపాను.

'చెబితే నమ్ముతావో నమ్మవో గానీ వెంకట్రావ్' — సుందర రామయ్యగారు ప్రారంభించారు. 'నా కెదురైన బాధగూడా అదే! వీధిలో తలచూపించడానికే భయం. పరిచయమున్న ప్రతివ్యక్తీ నిలవేయడమే! ఏమండీ, సుందరరామయ్య గారూ! మీ వాడికింకా ఉద్యోగం కాలేదా? అయ్యో, యిదేం దౌర్భాగ్యమండీ! చదివించడానికి ఒకపాటు పడ్డారా? మీ శ్రమంతా యిలా అడివిగాచిన వెన్నెలై పోవాలా కర్మ?' అంటూ తాము నేర్చిన జాతీయాలు, సామెతలు అన్నీ ప్రయోగించి నా దుంప తెంచేస్తున్నారు. ఇక వీధిలో నీటి పంపు దగ్గరికి వెళ్ళివచ్చినప్పుడలా మా ఆవిడ నీటితోబాటుగా కన్నీటిని గూడా తెచ్చుకుంటుంది. ఆడవాళ్ళు రోజుకొక రకమైన వార్త ప్రచారం చేస్తున్నారట! అబ్బాయిది ఉద్యోగం చేసే ముఖంలా కనిపించడంలేదని ఒకరి సాముద్రికం. అసలు ఉద్యోగం చేసే స్వభావం మా వంశంలోనే లేదని ఒకరి ఊహాగానం. ఆ మాట కొస్తే చదువుకున్న వాళ్ళకందరికీ దొరికి పోతాయా ఉద్యోగాలు అని ఒకరి వ్యాఖ్యానం. ఈ తాకిడికి తట్టుకోలేక అబ్బాయి నాలుగ్గోడల మధ్య మకాం పెట్టేశాడు. తల మాసింది. గడ్డం పెరిగింది. బట్టలు మార్చుకోవాలన్న ధ్యాసే లేదు. ఎప్పుడైనా మాట్లాడితే ఆ మాటలు గూడా అసంబద్ధంగా వున్నాయి. గాలి మార్పు జరగకపోతే చేజేతులా కీడు కొనితెచ్చుకున్నట్టే గావచ్చు. కానీ ఎక్కడికి పంపడం? ఎందుకు పంపడం? ఈ తర్జన భర్జన నెలరోజుల నుంచీ సాగుతోంది. ఇంతలో దేవుడే ఓ మార్గం చూపినట్టుగా నిన్ననే ఓ కాగితం చేతి కొచ్చింది. ఏదో ఉద్యోగానికి హైదరాబాదులో యింటర్వ్యూ. ఈ రోజే పంపాలి. చేత చిల్లికాను లేదు. ఎంత లేదన్నా వంద రూపాయలు కావలి వస్తాయి. పల్లెకు వెళ్ళి రావాలన్నా వ్యవధి లేకుండా వుంది...'

'అయ్యో, అదేమిటండీ సుందర రామయ్యగారూ! ఇంత మాత్రానికే యిలా నొచ్చుకోవాలా! పాడు డబ్బు! అది మనం మన అవసరాలకోసం వాడుకోడానికి గాకపోతే మరెందుకు? నా కష్టాలు నా కెన్ని వున్నా, అమ్మాయి పెళ్ళికని రెండువేల రూపాయలు బ్యాంకులో వుంచాను. పది గంటలకుగానీ బ్యాంకి తెరవరు. మీ




ఎక్కడ
లైఫ్‌బాయ్ వున్నదో
అక్కడ ఆరోగ్యము వున్నది

లైఫ్‌బాయ్ తో స్నానము మీకు అత్యంత ఆరోగ్యవంతమైన హాయి గొలుపుతుంది. లైఫ్‌బాయ్‌లో ఉత్తమమైన సబ్బులో వుండ వలసిన అన్ని సుగుణములే గాక ఇంకా ఎన్నియో వున్నవని మీరు తెలిసికొందురు.

లైఫ్‌బాయ్ మురికిలో గల క్రిములను కడిగి వేస్తుంది

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి      లింటాప్-L. 49-77 TL




కెందుకు! మీరు వెళ్ళండి. అబ్బాయిని ప్రయాణానికి సిద్ధం చేయండి. పన్నెండు గంటలకల్లా డబ్బు మీ చేతిలో వుంటుంది."

సుందర రామయ్యగారికి ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో స్ఫురించిందిగాదు. ఆలోచించగా కృతజ్ఞతను మాటల్లో వెల్లడించడం అవసరం కాదేమో ననిపించింది. ఎందుకంటే — కృతజ్ఞత హృదయంలో దాచుకోదగినది. కృతజ్ఞతను వెల్లడించినంత మేరకు హృదయం ఖాళీ అయిపోయింది.

● ● ●

నెల రోజుల అనంతరం ఒకనాటి సాయంకాలం పనంతా పూర్తయ్యాక ఆఫీసునుంచి వెలుపలికి వచ్చాడు వెంకట్రావు. కార్యాలయం ముంగిట పూలచెట్ల మధ్య తచ్చాడుతున్న సుందరరామయ్యగారు అతనికి హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు.

"ఏమిటండీ యిలా వచ్చేశారు? ఏమిటి విశేషం?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు వెంకట్రావు.

"విశేషమేనయ్యా వెంకట్రావ్! శుభవార్తను నీకుగాక పోతే మరెవరికి చెబుతాను. తెలియగానే రెక్కలుగట్టుకొచ్చేశాను. మా అబ్బాయికి ఉద్యోగం దొరికింది—"

"అలాగా! చాలా సంతోషమండీ సుందర రామయ్యగారూ! కడుపులో పాలు పోసినట్టయింది. ఏదీ కాస్తా వివరాలు, అవీ చెబుదురుగానీ కూచోండి...."

"అసలీ ఉద్యోగమైనా ఒకపట్టాన దొరికిందా వెంకట్రావ్! ఇంటర్వ్యూ కోసం వెళ్ళాడా! దానిలో వీడు సెలక్టు కాలేదు. ఆ ఆశాభంగంతో మరీహతాశుడైపోయి, దిక్కుతోచకుండా వీధులవెంట తిరుగుతుండగా ఓ స్నేహితుడు కనిపించాడట! ఎన్నడో హైస్కూల్లో ఒకటి రెండేళ్ళు కలిసి చదువుకున్న స్నేహం. ఆ స్నేహితుడు కృష్ణమూర్తిని తన యింటికి తీసుకెళ్ళాడట. వీడికోసమని వారం రోజులు సెలవుపెట్టి, పనిగట్టుకుని చూడవలసిన వాళ్ళనందరినీ చూచి, చెప్పదగిన వాళ్ళందరితోనూ చెప్పి, చెప్పించి, మెప్పించి ఒప్పించి మొత్తం మీద విశ్వప్రయత్నంతో ఉద్యోగాన్ని రాబట్టేశాడట! మనుషుల్లో మంచితనం లుప్తమైపోయిందని అనుకునే వాళ్ళం మనం! ఆ పాపానికిపరిహారం ఎలా చెల్లించుకోగలం? మొదటి నెలజీతం తీసేదాకా ఆ స్నేహితుడు తనను నా[illegible] యింట్లోనే వుండి పొమ్మంటున్నా[illegible] డనీ, చేత డబ్బు లేకపోవడ[illegible] తనకైనా అంతగనా[illegible]

కనిపించడం లేదనీ అబ్బాయి జాబు వ్రాశాడు...'

'అందుకేనండీ సుందరరామయ్యగారూ! బంధువుల కంటే స్నేహితులే నయమనిపిస్తుంది. మొన్ననే భాస్కరం దగ్గరినుంచి గూడా జాబు వచ్చింది. మీ రొక మంచి కబురు తెచ్చారుగదా, దానికి బదులుగా ఒక శుభవార్త నా జేబులోనే వుంది. ఇదిగో, యిదే మా భాస్కరం వ్రాసిన ఉత్తరం. మీ అబ్బాయికి దొరికినట్టే భాస్కరానికీ ఓ స్నేహితుడు దొరికాడట! అతగాడికి వైదేహిని చూపించి 'ఒరే బాబూ! ఇది మా చెల్లెలు. మేము పెద్దగా కానుకలు, కట్నాలూ యిచ్చుకోలేము. గుణం, రూపం, చదువూ, సంస్కారమూ — యివి మాత్రం చాలు ననుకుంటే నువ్వు మా అమ్మాయిని పెళ్ళాడవచ్చు' అన్నాడట. వైదేహిని చూచినప్పటినుంచీ ఆ అబ్బాయి గూడా యిదే ఉద్దేశంలో వున్నాడట. ఐనా పెద్దవాళ్లు ఒప్పుకోవాలి గదా! వాళ్ళ నాన్నగారి నొకమాట అడిగి చెబుతానన్నాడట! ఇంచుమించుగా ఈ సంబంధం కుదిరినట్టే గనుక నా ప్రయత్నాల్లో నన్నుండమని వ్రాశాడు భాస్కరం!'

అప్పటికి బాగా చీకటిపడింది. మసక చీకటిలో సుందర రామయ్యగారి ముఖం వెలవెల పోతుండడం వెంకట్రావు గమనించలేదు.

'ఎలాగైతే నేమండీ సుందర రామయ్యగారూ! అమ్మాయికి కన్నెచెర తప్పుతోంది అదే చాలు!'

సుందర రామయ్యగారు గూడా అదే మాట చెప్పబోయారు. కానీ మగపిల్లవాడి విషయంలో ఆ మాట చెప్పడం బాగుండదేమోనని మానేశాడు.

మిత్రు లిద్దరూ ఒకరి కొకరు చేరువగా రోడ్డు వెంట నడవసాగారు. దారి పొడుగునా సంభ్రమోత్సాహాలతో ఏదో చెప్పుక పోతున్నాడు వెంకట్రావు. కొండంత ఉత్సాహంతో తనను కలుసుకోడానికి వచ్చిన సుందర రామయ్యగారు కొద్ది నిమిషాల సేపట్లో పాతాళానికి క్రుంగి పోయారని వెంకట్రావుకు తెలియదు.

ఆ మాటకొస్తే సుందరరామయ్యగారికి తెలియని విషయాలు గూడా బహుళంగానే వున్నాయి.

ఒకటి. వెంకట్రావు వదినగారి కొడుకు భాస్కరం ఉద్యోగం చేస్తున్నది హైదరాబాదులో నేనని సుందరరామయ్యగారికి తెలియదు. రెండు. కృష్ణమూర్తికి దొరికిన స్నేహితుడు ఆ భాస్కరమేనని తెలియదు. మూడు. వైదేహిలో తనకు కోడలు కనిపించినట్టుగా కృష్ణమూర్తి కామెలో అర్ధాంగి కనిపించిందని తెలియదు.

□□□





# పుస్తక సమీక్ష

# "మల్లెలు"—కథామాలిక

ఇది కొత్తగా వెలువడిన కథా సంకలనం. ఇందులో అయిదుగురు రచయితల తొమ్మిది కథలున్నాయి.

ఈ రచయిత లందరు విద్యార్థులే కావడం ఒక విశేషం. వీరిలో ముగ్గురివి (ఏ ముగ్గురివి?) ప్రారంభ రచనలు కావడం మరొక విశేషం. సాధారణంగా మన రచయితలు ముందుగా పత్రికలద్వారా పాఠకులకు పరిచయం కాని కథలను గ్రంథస్థం చేయడానికి సాహసించరు. వీరు అలా కాకుండా తమ రచనలను ధైర్యంగా, నేరుగా పుస్తక రూపంలోనే ప్రచురించారు. ఇది ఇంకొక విశేషం.

మొదటి మూడు కథలు శ్రీరామకృష్ణవి. చక్కని కథాకథన శిల్పం సాధించడానికి తీవ్ర ప్రయత్నం వీరి కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఆకాశం తెల్లబోయింది' అనే దానిలో కోతలు కొయ్యడం అలవాటైన ఒక పెద్దమనిషి అబద్ధాలన్నీ బయటపడడం ఇతివృత్తం. కొస మెరుపుతో కథ ముగుస్తుంది. 'నడుస్తున్న చరిత్ర' అనే కథ దేశభక్తులుగా, ప్రజాసేవకులుగా చెలామణీ అవుతున్న వారిపై సెటైర. 'జ్ఞాతృత్వం' లో మామూలుగా యువకులకు విద్యార్థి దశలో కలిగే అవ్యక్తా వేదన, ఏదో తెలియని థ్రిల్ కోసం ఆరాటం వర్ణితమయ్యాయి. కథానాయకుడు సోమసుందరం చివరకు (బహుశా థ్రిల్ కోసం) ఆత్మహత్య చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

రెండవ రచయిత శ్రీ భాస్కర్. కథ పేరు 'అన్వేషణ'. దూర దేశంలో ఎంతో శ్రమించి కూడబెట్టిన డబ్బును కొడుకు, కోడళ్ళకు అప్పగించాలని ఒకడు బయల్దేరతాడు. కొడుకు స్వగ్రామం విడిచి పెట్టాడని తెలిసి అతనికోసం అన్వేషిస్తుండగా డబ్బంతా దొంగలు దోచుకుంటారు. మిగిలిన ఒక్క నగను బెజవాడ కనకదుర్గకు సమ